క్లుప్తంగా

జీవన్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం పరిశోధకుడు బత్తిని జీవన్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. పర్ఫార్మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ ఫినిపెట్ బేస్డ్ డిజిటల్ వీఎల్ఎస్ఐడీ కాడర్స్ మల్టిప్లెక్సెర్స్ అండ్ థెయిర్ అప్లికేషన్స్ అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ శివాని పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి జీవన్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు.

జర్నలిస్టులుగా గుర్తించాలి

హన్మకొండ చౌరస్తా: ఆకాశవాణిలో పనిచేస్తున్న క్యాజువల్ అనౌన్సర్, క్యాజువల్ కాంపెరర్స్‌గా పనిచేస్తున్న ఉద్యోగులను జర్నలిస్టులుగా గుర్తించాలని మీడియా అకాడమీ చైర్మన్ నారాయణను ఆ సంఘం అధ్యక్షుడు చిరంజీవి కోరారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో అనౌన్సర్లు, కాంపెరర్ల సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వామ్యులం అవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మగ్దూం, శ్యాం, ఎల్లయ్య, శ్రీనివాస్, కిషోర్ పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

మడికొండ: హైదరాబాద్‌లో ఆరు దొంగతనాలను పాల్పడిన దొంగలు వరంగల్ వైపు వస్తున్నారనే సమాచారం మేరకు మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఉదయం 4గంటల వరకు మడికొండ చౌరస్తాలో పోలీసులు వాహన తనిఖీ చేశారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వర నీరాజనంలో సనశ్రీ

వరంగల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఓ ప్రైవేటు ఛానల్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పర్యవేక్షణలో నిర్వహించిన భద్రాద్రి స్వరాంజలిలో నగరంలో కొత్తవాడకు చెందిన గాయకురాలు సనశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు నిర్వాహకులు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగురాష్ట్రాలతో పాటు సౌత్ ఇండియన్ సింగర్లు పాల్గొన్నారని నిర్వాహకులు అనుమాండ్ల నాగరాజు తెలిపారు.

'కనిష్క'లో సంక్రాంతి సంబరాలు



హసన్‌పర్తి: భీమారంలోని కనిష్క మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వేసిన ముగ్గులు, ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వెంకట్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్ శాస్త్రికి పురస్కారం



కాశిబుగ్గ: యూఎస్ఏ ఆస్ట్రాలజీ ఫెలోషిప్ అవార్డు, మహర్షి అగస్త్య జ్యోతిష్య రత్న అంతర్జాతీయ పురస్కారాన్ని నగరంలోని కొత్తవాడకు చెందిన జ్యోతిష్య వాస్తు పండితుడు, పురోహితుడు జి.రాజ్‌కుమార్ శాస్త్రి అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఆస్ట్రాలజీ ప్రముఖ జ్యోతిష్య సంస్థల విశ్వవిద్యాయాల సంయుక్త నిర్వహణలో బెంగుళూరులో శనివారం నిర్వహించిన పేరెంటల్ ఆస్ట్రాలజీ లైవ్ టాక్ షోలో పురస్కారాన్ని రాజ్‌కుమార్ స్వీకరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ నుంచి విద్యానగర్ ఉన్నత పాఠశాల వరకు రూ.13లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ ఆదివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, అధికారులు పాల్గొన్నారు.

ఆహార నియమాలు, శారీరక శ్రమతో గుండె పదిలం



మిషన్‌ను ప్రారంభిస్తున్న దయాసాగర్

వరంగల్ చౌరస్తా: ఆహార నియమాలు పాటిస్తూ, శారీరక శ్రమ చేస్తే గుండె వ్యాధులు దరిచేరవని గుండె వైద్య నిపుణులు వి.దయాసాగర్ తెలిపారు. వరంగల్ జేపీఎన్ రోడ్డులోని దినేష్ హార్ట్ క్లినిక్‌లో 4డీ ఎకో మిషన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుండె వ్యాధి నిపుణుడు ఎస్.దినేష్, వైద్యులు సామ్యూల్, శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, మమతరెడ్డి, పోల నటరాజ్, ఐఎంఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాల ఇష్టారాజ్యం

- నిబంధనలు పాటించని డ్రైవర్లు
- రహదారిపై ఆటోల నిలిపివేత
- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వైనం
- చూసీ కూడా పట్టించుకోని అధికారులు



కాజీపేట చౌరస్తాలో అడ్డదిడ్డంగా ఆగిన ఆటోలు

కాజీపేట: నగరంలో ఆటోవాలల అలసత్వం కారణంగా ప్రయాణికులు, బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలామంది ఆటోడ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

నిత్యం ట్రాఫిక్ జామ్

కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఆటోలను గంటల తరబడి రహదారులపై నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పట్టణంలో ప్రధాన వాణిజ్య కూడలి అయిన కాజీపేట చౌరస్తాకు నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. వందలాదిమంది వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చిపోతుంటాయి. రైళ్లు వచ్చినప్పుడు ప్రయాణికులతో రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఇంతటి రద్దీగల ప్రాంతంలో ఒక్క వాహనం కొద్దిసేపు ఆగినా వెనుక పదుల సంఖ్యలో వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభిస్తుంది. అయితే, కొంతమంది ఆటోడ్రైవర్లు ఇదేమీ పట్టించుకోకుండా గంటల తరబడి ఆటోలను ఇష్టారాజ్యంగా రహదారులపైనే నిలుపుతూ ట్రాఫిక్‌కు కారణమవుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్రధానంగా కాజీపేట చౌరస్తా, ఫాతిమానగర్, బాపూజీగనగర్, కాజీపేట రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో పలువురు ఆటో డ్రైవర్లు ఇష్టానుసారంగా ఆటోలను గంటలపాటు నిలుపుతుండడంతో తరుచుగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈసమస్య మరీ ఎక్కువగా ఉంటోంది. దీన్ని అడ్డుకోవాల్సిన ట్రాఫిక్, పోలీస్ సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రతిరోజు కార్యాలయాలు, పనులకు ఆలస్యంగా చేరుతున్నామని పలువురు వాపోతున్నారు. ట్రాఫిక్, సివిల్ పోలీసు అధికారులు ట్రాఫిక్ నియంత్రణను పక్కన బెట్టి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల కన్నా జరిమానాలు విధించడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తుండటం చర్చనీయంశంగా మారింది. ప్రయాణికులను ఎక్కించుకునేందుకు రోడ్డుపైనే ఆటోలు ఆగుతుండడంతో సోమిడి, మడికొండ, హనుమకొండ వైపు వెళ్లాల్సిన వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుపోతున్నారు. ఇటీవల ప్రయాణికుల సదస్సును ఏర్పాటు చేసి ఆటోలకు ప్రత్యేక అడ్డాలు, రహదారులపై ఆటోలు ఆపకుండా చర్యలు చేపడుతామని చెప్పిన అధికారుల పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

నిబంధనలు పాటించని డ్రైవర్లు

చాలామంది డ్రైవర్లు డ్రెస్‌కోడ్ పాటించడం లేదు. వాహనానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేకుండానే ఆటోలను నడుపుతున్నారు. సుమారు అనేక ఆటోల్లో సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకుని భారీ శబ్దంతో పాటలు వినుకుంటూ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. సగం మంది డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేవు. పట్టణంలో తిరిగే సగం ఆటోలకు సరైన కాగితాలు లేవు. వాటివల్ల ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే బాధితులకు తగిన పరిహారం రావడమనేది పెద్ద కష్టంగా మారింది. ప్రస్తుతం వరంగల్ నగరం పోలీస్ కమిషనరేట్‌గా మారినందునా అధికారులు స్పందించి నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బాధ్యులు

విద్యారణ్యపురి: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3ను జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యురాలు డాక్టర్ విద్యాదేవి, రిటైర్డ్ అడిషనల్ కలెక్టర్ మోహన్‌లాల్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాలలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తొలి మహిళా ఉపాధ్యాయురాలని, బడుగు, బలహీన వర్గాల చదువుకోసం విశేష కృషి చేశారని గుర్తుచేశారు. సావిత్రిబాయి పూలేను నేటి ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల నుంచి 80మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. సమావేశంలో ఇరు జిల్లాల టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యక్షురాలు మర్రి అన్నాదేవి అధ్యక్షత వహించగా, టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, తాటికాయల కుమార్, పెండెం రాజు, నిర్మల, గ్లోరి, రాణి, చంద్రకళ, సువర్ణ గ్రేస్, ఫణి, రమాదేవి, ఉదయశ్రీ, అరుణ, సీహెచ్.రవీందర్‌రాజు, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ

మడికొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా కాజీపేట మండలం మడికొండలోని శ్రీవేదవ్యాస పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈమేరకు 40 మందికి బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా సేవా భారతి జిల్లా కార్యదర్శి హనుమారెడ్డి మాట్లాడుతూ చీకటి నుంచి వెలుగు వైపు నడిపించి, సమాజంలో మార్పు తీసుకువచ్చే పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. కాగా, కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా రజిత, వసుంధర వ్యవహరించారు. కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ పున్నం వీరారెడ్డి, కార్యదర్శి డాక్టర్ వెంకటనారాయణ, అనిత, సంపత్‌రెడ్డి, లక్ష్మి, తాజన్నీసా, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందరాజుల గుట్ట ప్రవేశ ప్రాంగణంలో మహిళలు ఆదివారం వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాత్తాద వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలను ట్రాఫిక్ సీఐ బాబులాల్, కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ పరిశీలించి విజేతలకు నగదు బహుమతి అందజేసి, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి, రామానుజం, జగదీశ్వర్, బీఆర్ఎస్ నాయకుడు చింతాకుల సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక పుష్టిని సృష్టించే పథకాలు అవసరం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

విద్యారణ్యపురి: సంక్షేమ పథకాలు పేదరిక నిర్మూలనకు ఉపయోగపడాలని, ఈక్రమంలో ఆర్థిక పుష్టి కలిగించే పథకాలను ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేయాలని హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ చిట్టి కృష్ణారెడ్డి సూచించారు. స్వదేశీ జాగరణ మంచ్ హనుమకొండ జిల్లాశాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని సామ జగన్మోహన్ స్మారక భవనలో ఆదివారం నిర్వహించిన సంక్షేమం, ఉచిత పథకాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నైపుణ్యాలు పెంచేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్వదేశీ జాగరణ మంచ్ నాయకుడు సాయిప్రసాద్ మాట్లాడుతూ స్థానిక ఉత్పత్తులను వినియోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. సదస్సులో తెలంగాణ రాష్ట్ర సంపర్క్ ప్రముఖ్ గురిజాల రవీందర్, స్వదేశీ జాగరణ మంచ్ వరంగల్ విభాగ్ కన్వీనర్ కంది శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కన్వీనర్ భరత్‌కుమార్, జిల్లా బాధ్యులు హరినాథరావు, వెంకన్న, డాక్టర్ సురేష్, ప్రభాకర్, జంగా గోపాల్‌రెడ్డి, డాక్టర్ నాగభూషణం, బూర రామచందర్, పింగిళి ప్రవీణ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల హాస్టల్ ప్రారంభం



హసన్‌పర్తి: రూ.1.80 లక్షల వ్యయంతో హనుమకొండలో నూతనంగా నిర్మించిన దివ్యాంగుల వసతి గృహాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా దివ్యాంగులకు రూ.3 వేల పెన్షన్ అందిస్తున్న ఏకైక రాష్ట్ర తెలంగాణ అని అన్నారు. దివ్యాంగుల కోసం త్వరలోనే ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, దివ్యాంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ వాసుదేవారెడ్డి, జెడ్పీచైర్మన్ సుధీర్‌కుమార్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్, డాక్టర్ అనితారెడ్డి, దివ్యాంగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలానగర్ కాలనీ ఏర్పాటు

హసన్‌పర్తి: 55వ డివిజన్‌లోని బాలానగర్ (జక్కుల బాలరాజు, నాగయ్య, రాములు) కాలనీని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జక్కుల రజిత మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. గణేష్ మండపం నిర్మాణానికి రూ.2లక్షలు, భూమి కోసం రూ.9లక్షలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బాలానగర్ కమిటీ అధ్యక్షుడు ఇస్లావత్ మోహన్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు రవిమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోల్ల రాము, కోశాధికారి అనిల్‌రావు, ముఖ్య సలహాదారుడు తడక కుమారస్వామి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు అరుణ్, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నాయకపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



యాత్రలో మాట్లాడుతున్న వీరయ్య

కాజీపేట రూరల్: రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీని పరిరక్షించాలని పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. రవాణారంగ కార్మికుల యాత్ర కాజీపేట జంక్షన్‌కు ఆదివారం చేరుకోగా కార్మికులు స్వాగతం పలికారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గాదె ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరయ్య మాట్లాడుతూ 12లక్షల మందికి పైగా పనిచేస్తున్న రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు లేదని, ఫలితంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ ఆర్టీసీని పరిరక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సంఘర్షణ యాత్రలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ వేల్పుల సారంగపాణి, మెట్టు రవి, బొల్లారపు సంపత్, పుల్ల అశోక్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి: రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎస్.రావు డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర జీపుజాతా ఆదివారం హనుమకొండకు చేరుకుంది.

158మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 158మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అరూరి రమేష్ పంపిణీ చేశారు. హసన్‌పర్తిలోని శుభమస్తు గార్డెన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వరంలాంటివని అన్నారు. అలాగే, మరో 38మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రజిత, దివ్యారాణి, ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, నరేడ్ల శ్రీధర్, అటికం రవీందర్, చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, వీక్టర్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్లు ఉదయ్‌కుమార్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, మేర్గు రాజేష్, జక్కు రమేష్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ రెడ్డికాలనీలోని ప్రభుత్వ బాసిత్‌నగర్ పాఠశాలలో 1989 -90లో ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వారందరూ చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. పాఠశాలకు రూ.40వేల ఖర్చుతో 12 డెస్కులు, 10 ప్లాస్టిక్ కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత పాఠశాల హెచ్ఎం హుస్సేన్, నాటి గురువులు సీహెచ్.రవిందర్, రంగాచారిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, ధనుంజయ, పరమేశ్వర్, విద్యాకమిటీ చైర్మన్ గౌస్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రికెట్ క్రీడాకారులను అభినందిస్తున్న జబ్బార్

ఖిలా వరంగల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వరంగల్ తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ.జబ్బార్ సూచించారు. వరంగల్ కరీమాబాద్ రోడ్డు ఎస్ఆర్ఆర్ తోటలోని తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రధాన కార్యాలయంలో జబ్బార్‌ను క్రికెట్ జట్టు క్రీడాకారులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీమాబాద్ రామస్వామి క్రీడాప్రాంగణంలో నన్నపునేని నరసింహామూర్తి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో విజయం సాధించి ఓరుగల్లు కీర్తిని చాటాలని సూచించారు. అనంతరం క్రికెట్ జట్టుకు ఆర్థిక చేయూతనందించి అభినందించారు. కార్యక్రమంలో ఎండి.చాంద్ పాషా, క్రికెట్ టీమ్ కెప్టెన్ అరీపొద్దీన్, అబ్దుల్ అజీజ్, అఫ్రోజ్, అమీర్, మున్నా, ఖలీద్, ఆసిఫ్ పాల్గొన్నారు.

అవసరార్థులకు దాతల ఆర్థిక సాయం



శోభారాణికి ఆర్థికసాయం చేసిన అయిలయ్య



నగదు అందజేస్తున్న వెంకటేశ్వర్ రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తెలుగు విభాగంలో పార్ట్‌టైం అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కందాల శోభారాణి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెను హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య ఆదివారం పరామర్శించి వైద్యసాయం నిమిత్తం రూ.10వేలు అందజేశారు. కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు తమ సంఘం తరఫున రూ.22 వేలు అందించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

హసన్‌పర్తి: గుండెపోటుకు గురై మృతి చెందిన ముచ్చర్లకు చెందిన దావా రాజు అంత్యక్రియలకు బీఆర్ఎస్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. దహన సంస్కారాలకు నిమిత్తం రూ.3వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సూర ప్రమోద్, నాయకులు శ్రీధర్, రాజేష్, మట్టెడ కుమార్, మోహన్, అనిల్, శ్రీనివాస్, సాంబయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ప్రత్యేక గుర్తింపు



విజేతలతో నెహ్రూ యువ కేంద్రం సభ్యులు

కాశిబుగ్గ: క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని నెహ్రూ యువ కేంద్రం అధికారి అన్వేష్ అన్నారు. వరంగల్ ఓసిటీ స్టేడియంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్పోర్ట్స్ మీట్‌లో ఆదివారం అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్‌లో గీసుకొండ ప్రథమ స్థానం, సంగెం మండలం జట్టు రెండోస్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్‌లో నర్సంపేట మొదటి స్థానం, గీసుకొండ జట్టు రెండో స్థానంలో నిలిచింది. విజేత జట్లకు అన్వేష్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు, భారత యువసేన యూత్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

వరంగల్ చౌరస్తా: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 24వ రోజు ఆదివారం అమ్మవారికి గాజుల అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పూజలు చేసిన అనంతరం భక్తులు మంగళ శాసనాలు చేసి తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎలపాటి రత్నాకర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా నాగరాజు



తోట నాగరాజు

హసన్‌పర్తి: ఎర్రగట్టుగుట్ట మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా తోట నాగరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఆకుల కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కత్తెరశాల ప్రశాంత్, కోశాధికారిగా ఉప్పుల సంపత్, సహాయ కార్యదర్శిగా దాది నాగరాజు, సహాయ కోశాధికారిగా గంట రాజయ్య, కార్యవర్గ సభ్యులుగా రాకేష్, ప్రవీణ్, సంపత్, చిరంజీవిని ఎన్నుకున్నారు.

భద్రకాళి ఆలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కుమారుడు నందమూరి రామకృష్ణబాబు ఆదివారం సందర్శించారు. రామకృష్ణతో కలిసి వరంగల్ టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నల్లకుంట రవికుమార్ అమ్మవారికి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్యాలయ కార్యదర్శి పిట్టల శ్రీనివాస్, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ జీఎల్.శ్రీధర్, నగరపాలక సంస్థ మాజీ డిప్యూటి మేయర్ కక్క సారయ్య, ఎమ్‌డి.రహీం తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

న్యూశాయంపేట: స్వచ్ఛంద సంస్థ ద్వారా పేదలకు మేలు జరిగేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ కలీం సూచించారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయానికి సౌదీ అరేబియా జెద్దా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అక్తర్ షరీఫ్, అబ్దుల్ కలీం విచ్చేసిన సందర్భంగా వారిని సన్మానించారు. అనంతరం ఉర్దూ, తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ సిరాజ్‌అహ్మద్, మహబూబ్‌అలీ, సలీం, చిస్తీహసన్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



కాజీపేట: రాష్ట్రంలో ఉన్నత చదువులు చదివిన సరైన ఉద్యోగ అవకాశాలు రాక నిరుద్యోగులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు సీపీఐ (ఎంఎల్) రెవల్యూషనరీ ఇన్సెంటివ్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం అన్నారు. కాజీపేట చౌరస్తాలో ఆదివారం సాయంత్రం సీఐటీయూ రవాణారంగ కార్మికుల సంఘర్ష్ యాత్రకు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, గట్టు ప్రభాకర్‌రెడ్డి, రాగుల రమేష్, వేల్పుల సారంగపాణి, మెట్టు రవి, బొల్లారపు సంపత్, పుల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు దేవస్థాన మాజీ డైరెక్టర్ మృతి

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి దేవస్థాన మాజీ డైరెక్టర్ వై.రవి ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాగా, రవి మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్, కార్పొరేటర్ శివకుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, మాజీ ధర్మకర్త కృష్ణమూర్తి సందర్శించి నివాళులర్పించారు.

తల్లిదండ్రులకు విద్యార్థుల పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తి క్రాస్‌లోని ఐపీఎస్ స్కూల్‌లో 'తల్లిదండ్రులకు పాదపూజ' అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పీఆర్వో కె.రాజారాం, 66వ డివిజన్ కార్పొరేటర్ శివకుమార్, పాఠశాల యాజమాన్యవర్గ సభ్యులు చిటికేశి సదాశివుడు, సురేష్, అజ్మీర రమేష్, సాంబశివరావు, రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చింతకింది వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.